వైఎస్సార్‌కు ఘన నివాళి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకొని శనివారం తెల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవరి సాయినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతినగర్ డివిజన్‌లో వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.


తెల్లాపూర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పేదల పెన్నిధి వైఎస్సార్..

పటాన్‌చెరు టౌన్: పేదల పెన్నిధి దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులతో కలిసి పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం తన జీవితాన్నే ధారపోసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేటికీ నిరుపేదల గుండెల్లో కొలువై ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, నాయకులు కుంచల్ కిషన్, యువరాజ్ మోరే, గోపాల్, ఖదీర్ పాల్గొన్నారు.

శ్రీరాంనగర్ కాలనీలో..

పటాన్‌చెరు పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని కాలనీ పెద్దలు వీరారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలనీవాసులు యువరాజ్, ఆనంద్‌రెడ్డి, కుమార్, ప్రకాష్, రాజేశ్వర్‌రెడ్డి, యోగేశ్వర్‌రావు, రవి, సుజిత్, నాగేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్ అయ్యప్పసొసైటీలో..

మాదాపూర్: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను శనివారం మాదాపూర్ అయ్యప్పసొసైటీలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ, పీసీసీ ప్రతినిధి ఎస్ సత్యంలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిన నాయకుడని తెలిపారు. ఎన్నో అద్భుత పథకాలను ప్రవేశపెట్టి సంక్షేమానికి అసలైన నిర్వచనం చెప్పిన నాయకుడని అన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు సురేష్, సుధాకర్‌రెడ్డి, శోభ, కొడుగు అప్పారావు, ప్రవీణ్‌గౌడ్, సందీప్ సాగర్, శివ, కురుమరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో..


అయ్యప్పసొసైటీలో.. కాంగ్రెస్ నాయకులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



శిల్పారామంలో వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం మైసూర్ ప్రముఖ భరత నాట్య కళాకారిణి అనఘా భరతనాట్య ప్రదర్శనతో అలరించింది. ఇందులో దేవర్ణమా, కృతి అంశాలను ప్రదర్శించారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా యుక్తారెడ్డి శిష్యబృందం మూషిక వాహన, పంచాక్షరీ, వేంకటాచల నిలయము, శ్రీరాఘవం, పుష్పాంజలి, నవరసాలు తదితర అంశాలను కళాకారులు మాధురి, అనిత, నమ్రత, శాన్వి, నేహ, నక్షత్ర, గీతిక, రైతు, ఐశ్వర్యలు ప్రదర్శించారు. – మాదాపూర్

అన్నిరంగాల్లో అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- కొండాపూర్ డివిజన్‌లో రూ.5.41 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం కొండాపూర్ డివిజన్‌లో రూ.5.41 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. కాలనీలు, బస్తీలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని అన్నారు. గచ్చిబౌలి నుంచి బొటానికల్ గార్డెన్, ఆదిత్యటవర్ నుంచి పీజేఆర్‌నగర్ వరకు రూ.2.29 కోట్ల నిధులతో ఫుట్‌పాత్ నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్, ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్, జంగంగౌడ్, రూపారెడ్డి, నర్సింహసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పోకడలకు అనుగుణంగా శిక్షణ అవసరం

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: వ్యవస్థలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం కొత్త పోకడలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ శిక్షణ అవసరమని ,దీని ద్వారా ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించ వచ్చని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఈఎండీ అండ్ సీటీఈ గ్రూప్–ఏ ఆఫీసర్స్ ఆఫ్ మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ బ్యాచ్ కోసం ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమం 20 రోజులపాటు సాగుతుంది. ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం నీటి సరఫరా, వినియోగం, వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ టెక్నాలజీస్, వాటర్ హార్వెస్టింగ్, నీరు, శానిటేషన్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ల వినియోగం వంటి అంశాలు, విద్యుత్ పరికరాలు ట్రాన్స్‌ఫార్మర్లు, భద్రతా చర్యలు, నిర్మాణాలు, రోడ్లు, ప్రణాళిక డిజైన్, నిర్మాణం, ప్రత్యేక నిర్మాణ పద్ధతిపై కేస్ స్టడీస్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్కీ అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు.


శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో డైరెక్టర్ డా.రామేశ్వరరావు తదితరులు

క్లుప్తంగా

హోరాహోరీగా టీ 9 గోల్ఫ్ ఛాలెంజ్ టోర్నీ

సాక్షి, సిటీబ్యూరో: టీ9 ఛాలెంజ్ గోల్ఫ్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. సెమీ ఫైనల్ రేసులో అయిదు జట్లు నిలిచాయి. టైటిల్ ఫేవరెట్ ఎకోలాస్టిక్ ఈగల్స్ మరో విజయంతో అగ్రస్థానంలో నిలిచింది. గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ కోర్సులో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఈగల్స్ 3–1 స్కోర్ తో నోవాటెల్ స్టార్స్ జట్టుపై ఘన విజయం సాధించింది. దీంతో మరో రౌండ్ మ్యాచ్ మిగిలి ఉండగా 18 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది. మరో మ్యాచ్ లో సిమెట్రిక్స్ జట్టు 4–0తో బీహెచ్ జీసీసీ రైడర్స్‌ను చిత్తు చేసింది. ప్రస్తుతం సిమెట్రిక్స్ జట్టు 17.5 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఇదిలా ఉంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్ లో బౌల్డర్ హిల్స్ టైగర్స్ 3–1తో జాగృతి జాగ్వార్ ను ఓడించింది. బౌల్డర్ నింజాస్, టీజీఎఫ్ బ్యాక్ స్పిన్నర్ల మధ్య మ్యాచ్ 2–2 స్కోర్ తో టైగా ముగిసింది. కాగా బౌల్డర్ హిల్స్ టైగర్స్ 14.5 పాయింట్లతో మూడో స్థానంలో ఉండగా... జాగ్వార్స్, నోవాటెల్ స్టార్స్ చెరో 14 పాయింట్లతో 4, 5వ స్థానాల్లో నిలిచాయి. ఇక బ్యాక్ స్పిన్నర్స్ , రైడర్స్ , నింజాస్ చివరి మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

స్వరార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం అభినయ కూచిపూడి ఆర్ట్ అకాడమీ గురువు ఉషా గోటేటి శిష్యులు దాదాపు 20 మంది కూచిపూడి నృత్యంతో అలరించారు. అదిగో అల్లదిగో, ముద్దుగారే యశోద, తిరుతిరు తదితరాలను ప్రదర్శించారు. గురువు ఊర్వశీసతీష్‌ని డాక్టర్ శోభరాజు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

చిత్ర ప్రదర్శన





మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం నెరేటివ్స్ ఆఫ్ ది ఇయర్ నౌ పేరిట చిత్రప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను రిటైర్డ్ ఐపీఎస్ సాహు, ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీ, ఆర్టిస్ట్ అంజు పొద్దార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదిలోని భావాలను చిత్రాల ద్వారా తెలిపే అవకాశం కళాకారులకు మాత్రమే ఉంటుందన్నారు. ఈనెల 16వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్



మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శనివారం హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్‌ను నటి ఉల్కాగుప్తా, శుభశ్రీ రాయగురు, నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు.

జీఓ 58,59లతో భరోసా

మియాపూర్: దశాబ్దాలుగా నివాసముంటున్న నిరుపేదలకు జీఓ 58,59 ద్వారా రెగ్యులరైజేషన్ చేసి జీవితంపై భరోసా కల్పించిన గొప్ప మహానుభావుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి,మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట,చందానగర్, భారతీనగర్ డివిజన్‌లలో జీఓ 58,59 కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులకు యాజమాన్య హక్కులను కల్పిస్తూ మంజూరు పత్రాలను తహసీల్దార్ వంశీమోహన్‌తో కలిసి ఆయన అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, మంజుల రఘునాథ్‌రెడ్డి, ఆర్‌ఐ శ్రీకాంత్, శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



హఫీజ్‌పేట్ : నిరుపేదలకు అండగా హోప్ ఫౌండేషన్ నిలుస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండి రమేష్ పేర్కొన్నారు. శనివారం చందనగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో వికలాంగుడు డి.రాజు కవల పిల్లలు సాయిరేఖ, సంగీతల చదువు కోసం రూ.30వేలు అందజేశారు. చెక్కును బండి రమేష్, కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్‌లు విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో నాయకులు కోమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, నల్లా సంజీవరెడ్డి, యాదగిరి గౌడ, కరుణాకర్ రెడ్డి, సంగారెడ్డి, అరుణ, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ను ప్రారంభించిన హోంమంత్రి

గచ్చిబౌలి: నగరంలో ఆల్ టాజా రెస్టారెంట్లను హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ శనివారం ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. గచ్చిబౌలి, కొండాపూర్, ఆసిఫ్‌నగర్‌లలో ఆల్ టాజా రెస్టారెంట్‌లు అందుబాటులోకి వచ్చాయి. చికెన్, షావర్మ, శాండ్‌విచ్, జ్యూస్‌లు, బర్గర్లు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

మాదాపూర్: మాదాపూర్ డివిజన్ సాయినగర్ స్వాతి హైస్కూల్‌లో అపోలో ఆస్పత్రి జూబ్లీ హిల్స్ సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. షుగర్, బీపీ, కంటి, దంత, వినికిడి పరీక్షలతో పాటు ఈసీజీ పరీక్షలు చేశారు. వైద్యులు డాక్టర్ ఫయాజ్, వినయ్, సంతోష్ మాట్లాడుతూ నిత్యం వ్యాయామం, ధ్యానం, నడక అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వి.ఫణికుమార్, విష్ణుప్రసాద్, జనార్దన్, వాని సాంబశివరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏబీవీపీ పతాకావిష్కరణ

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అక్షయ్ తెలిపారు. హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద ఉదయం 10 గంటలకు పతాకావిష్కరణ చేస్తామని అనంతరం మొక్కలు నాటతామని వివరించారు.

శ్రమించారు.. సున్నాలు వేశారు

- గోపన్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో రంగులేసిన ఏబీవీపీ కార్యకర్తలు



రాయదుర్గం: ఏబీవీపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ శాఖ కార్యకర్తలు శ్రమదానం చేశారు. గోపన్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేయాలని నిర్ణయించారు. శనివారం ఉదయం రంగులు అద్దుతూ పాఠశాలకు కొత్త అందాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అక్షయ్, కార్యదర్శి ఆకాష్, జాతీయ కార్యవర్గ సభ్యుడు సందీప్, ఉపాధ్యక్షుడు ఫణీంద్ర, తులసీరామ్, తరుణ్, గరల్స్ కన్వీనర్ సాక్షి, పరిశోధక విద్యార్థుల కన్వీనర్ బాలకృష్ణ పర్యవేక్షణలో పనులను చేపట్టారు. కార్యక్రమంలో ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ ప్రతినిధులు రాజేంద్ర, మీనా, ధర్మవీర్, నిశాంత్, వెంకట్ సాయి తదితరులు పాల్గొన్నారు.

డైమండ్‌హిల్స్ సమస్యలు పరిష్కరించాలని వినతి

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో ప్రధాన రహదారికి అనుకొని ఉన్న డైమండ్‌హిల్స్‌లో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి డైమండ్ హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. డైమండ్‌హిల్స్ సమస్యలను ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. డైమండ్‌హిల్స్ లేఅవుట్‌లో జెఎన్‌ఆర్‌ఎం నిధులతో గతంలో యూజీడీ పైపులైన్ వేసినప్పటికీ మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. 2014కు ముందు ఉన్న నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ అధికారులు నోటీసులు ఇచ్చారని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. 28 ఏళ్ల నాటి లేఅవుట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి 400 మందికి న్యాయం చేయాలని కోరారు. డైమండ్‌హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, కోశాధికారి వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శి నర్సింహ్మారావు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గాంధీని కలిసిన సొసైటీ సభ్యులు

ఆధ్యాత్మిక కేంద్రంగా సిద్ధి గణపతి ఆలయం

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: రుద్రారం సిద్ధి గణపతి దేవాలయాన్ని రాష్ట్రంలోనే ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. దేవాలయ అభివృద్ధిలో భాగంగా రూ. 1.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన అన్నదాన సత్రం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్ధి గణపతి దేవాలయాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రూ. 50 లక్షల సొంత నిధులను అయ్యప్ప, శివ, ఆంజనేయ స్వామి భక్తుల ధ్యాన మందిర నిర్మాణాలకు కేటాయించామన్నారు. రాజ గోపురాల నిర్మాణాలకు సైతం నిధులు అందించామన్నారు. నియోజకవర్గంలోని పురాతన ఆలయాలను జీర్ణోధారణ చేయడంతో పాటు నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీలు రాజు, హరిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, గాయత్రి పాండు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాండు, సీఐ లాలు నాయక్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ మోహన్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన సత్రం ప్లానింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వాలి

- ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్

రాయదుర్గం: స్టార్టప్‌లు కొత్త దృక్పథాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కారానికి ఖచ్చితమైన విధానాలని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో ఆర్జేస్ ఇనిఫ్రనిటీ సొల్యూషన్స్ రెండో వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్నోవేషన్, ఉద్యోగాల కల్పన ఆర్థిక వృద్ధికి స్టార్టప్‌లు చోదకాలుగా పనిచేస్తాయన్నారు. ప్రభుత్వాలు, పారిశ్రామిక దిగ్గజాలు, సమాజం స్టార్టప్‌ల అపార సామర్థ్యాన్ని గుర్తించి మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యమన్నారు. 'రన్ ఫర్ ది సక్సెస్' అనే ఆర్జేఈవైఎస్ కార్నివాల్ ట్యాగ్ లైన్ ఎంతగానో ఆకట్టుకుందన్నారు. కార్యక్రమంలో గైన్‌సైట్ సంస్థ ప్రతినిధులు శ్రీధర్ గొల్లపల్లి, సుధీర్ గోదా, పవన్ తాళ్ళపల్లి తదితరులు పాల్గొన్నారు.


ఆర్జేఈవైఎస్ సంస్థ ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న జయేష్‌రంజన్

కాలనీ అభివృద్ధికి కృషి

హఫీజ్‌పేట్ : వినాయక్‌నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లో నిర్మించిన అదనపు భవనాన్ని కాలనీవాసులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నాని, ఎలాంటి సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు హమీద్ పటేల్, జగదీశ్వర్ గౌడ్, నాయకులు గౌతమ్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మారెడ్డి, ధాత్రిగౌడ్, రఘునాథ్, వెంకటేశ్వరరావు, దామోదర్‌రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ధరణినగర్‌లో డ్రైనేజీ, రోడ్లకు సంబంధించిన సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన శనివారం ధరణినగర్‌లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైటెన్షన్ లైన్ రోడ్డులోని డ్రైనేజీ, వాటర్ లైన్ సమస్యలు, సీసీ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో నిర్మాణ పనులు చేపట్టే విధంగా కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షుడు రాజబాబు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి టోకరా

పటాన్‌చెరు టౌన్: కమీషన్ పేరిట ఆశ చూపి సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. దీంతో భారీ నగదు పోగొట్టుకొని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూన్ 28న పార్ట్ టైం జాబ్ అంటూ వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించాడు. అందులో తన వివరాలు నమోదు చేసుకున్నాడు. దీంతో సైట్ నిర్వాహకుడు అతడికి ఒక వాలెట్ ఐడీ ఇచ్చారు. అందులో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేస్తున్నాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తున్నారు. ఈ క్రమంలో బాధితుడు తన భార్య నగలు అమ్మి, స్నేహితుల వద్ద అప్పు చేసి, జాబ్‌లోను ద్వారా మొత్తంగా 35 దఫాలుగా రూ.46 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతోపాటు కమీషన్ నగదు చూపించారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు ఇవ్వగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూర్ఛతో రోడ్డుపై పడి వ్యక్తి...

పటాన్‌చెరు టౌన్: ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన భానూర్–బీడీఎల్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం... ఏడాది క్రితం న్యాల్‌కల్‌కు చెందిన రాములు(52), భార్య పుణ్యమ్మ పిల్లలతో కలిసి మండలంలోని ఇస్నాపూర్‌కు బతుకుదెరువు కోసం వచ్చారు. అంబేడ్కర్ కాలనీలో నివసిస్తున్నారు. పాశమైలారం పారిశ్రామికవాడలో భార్యాభర్తలిద్దరూ వేర్వేరు కంపెనీల్లో పనిచేసుకునేవారు. రోజు మాదిరిగానే ఇద్దరూ కలిసి పారిశ్రామికవాడకు శనివారం వెళ్లారు. భార్య తాను పనిచేసే కంపెనీకి వెళ్లింది. భర్త నిక్కి టూల్స్ పరిశ్రమ సమీపంలో ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడిపోయాడు. దీంతో స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న రాములు భార్య పుణ్యమ్మ అక్కడికి చేరుకునేలోపే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మియాపూర్ : గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్విన్ ఎక్స్ రోడ్డు సమీపంలోని బస్టాప్ వెనుక ఓ వ్యక్తి పడి ఉన్నాడని పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందినట్టు గుర్తించారు. అతని వద్ద ఎలాంటి చిరునామా లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.